వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF
VANDE BHARATH
గురువారం, అక్టోబర్ 22, 2026



అలనాటి జ్ఞాపకాల కలయిక

■ ఘనంగా పూర్వ విద్యార్థుల సిల్వర్ జూబ్లీ వేడుకలు

హనుమకొండ, వాయిస్ ఆఫ్ వందే భారత్ : కేయూ ఫస్ట్ గేట్ సమీపంలోని శారద, ప్రగతి హైస్కూళ్ల పూర్వ విద్యార్థుల సమ్మేళనం అత్యంత కోలాహలంగా, ఆత్మీయ అనుభూతుల నడుమ సాగింది. 2000 – 2001 విద్యాసంవత్సరంలో పదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులంతా సుమారు 25 ఏళ్ల తర్వాత ఒకే వేదికపైకి చేరి, తమ బాల్య జ్ఞాపకాలను పునశ్చరణ చేసుకున్నారు. ఈ సందర్భంగా విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాల కరస్పాండెంట్ పరమేశ్వర స్వామితో పాటు ఉపాధ్యాయులు బాలకృష్ణ, భగవాన్ రెడ్డి, శ్రీలత, సదానందం, దశరథం, మురళిలను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించి, పూలమాలలు వేసి శాలువాలతో గౌరవించారు. తమ భవిష్యత్తుకు బలమైన పునాది వేసిన గురువుల రుణం తీర్చుకోలేనిదని పూర్వ విద్యార్థులు భావోద్వేగంతో స్మరించుకున్నారు. కార్యక్రమంలో భాగంగా, ఈ మధ్యకాలంలో అకాల మరణం చెందిన తమ తోటి విద్యార్థులు శివశంకర్, సంధ్యారాణి, హరిత, అజయ్‌లకు జ్ఞాపకార్థం రెండు నిమిషాల మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో పూర్వ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రసంగాలు, ఆటపాటలు, డాన్సులతో కార్యక్రమం ఎంతో సందడిగా సాగింది. పాత మిత్రులంతా ఒకరినొకరు పలకరించుకుంటూ, ప్రస్తుత ముచ్చట్లను పంచుకుంటూ రోజంతా సందడిగా గడిపారు.

రబీలో వరి వద్దు.. ఆరుతడి పంటలే ముద్దు!

• కమలాపూర్ మార్కెట్ చైర్ పర్సన్ తౌటం ఝాన్సీరాణి పిలుపు

కమలాపూర్, వాయిస్ ఆఫ్ వందే భారత్ : పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన "ఎల్ నినో" ప్రభావంతో భూగర్భ జలాలు గణనీయంగా తగ్గినందున, వచ్చే రబీ సీజన్‌లో రైతులు వరి పంట సాగుకు స్వస్తి పలికి.. ఆరుతడి పంటలు, కూరగాయల సాగు వైపు మళ్లాలని కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తౌటం ఝాన్సీరాణి రవీందర్ పిలుపునిచ్చారు. గురువారం నాడు గూడూరు రైతు వేదికలో కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ, వ్యవసాయ శాఖ సంయుక్తంగా "భూమి సాగు సంరక్షణ" అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చైర్మన్ ఝాన్సీరాణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.





ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రకృతి వైపరీత్యం కారణంగా దేశవ్యాప్తంగా ఏర్పడిన "ఎల్ నినో" విపత్తును రైతులందరూ ఐక్యంగా ఎదుర్కోవాలని కోరారు. ప్రభుత్వ సూచనలు, సలహాలు పాటిస్తూ అధికారులకు రైతులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అనవసరంగా ఎక్కువ నీటి వినియోగం జరిగే పంటలను సాగు చేసి రైతన్నలు ఆర్థికంగా నష్టపోవద్దని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి జన్ను యాకయ్య, బాలసాని రమేష్ గౌడ్, మార్కెట్ డైరెక్టర్లు సముద్రాల కృష్ణ, జనగాని శివకృష్ణ, గట్టు శ్రీధర్, కిన్నెర కృష్ణమూర్తి, ఆకినపల్లి భిక్షపతి, మిల్కూరు శ్రీనివాస్, నుగ్గుల లింగయ్య, కాంగ్రెస్ నాయకులు పాక చంద్రమౌళి, భాషబోయిన రమేష్‌తో పాటు పలువురు సర్పంచులు, వ్యవసాయ శాఖ అధికారులు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

గూడూరులో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పనుల పరిశీలన

కమలాపూర్, వాయిస్ ఆఫ్ వందే భారత్ : హుజరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ ఒడితల ప్రణవ్ బాబు ఆదేశాల మేరకు కమలాపూర్ మండలం గూడూరు గ్రామంలో ఇటీవల పేదలకు కేటాయించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో మిగిలిపోయిన పనులను గురువారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తౌటం ఝాన్సీ రాణి పర్యవేక్షించారు. గ్రామంలో నిర్మించిన ఇళ్లలో ప్రస్తుతం కొనసాగుతున్న శానిటేషన్, ఎలక్ట్రిసిటీ పనులను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించి పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ తౌటం ఝాన్సీ రాణి మాట్లాడుతూ.. ఇళ్లలో మిగిలివున్న అన్ని రకాల పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టర్ ను ఆదేశించారు. లబ్ధిదారులు త్వరగా ఇళ్లలోకి గృహప్రవేశం చేసేలా మౌలిక వసతుల పనులను నాణ్యతతో పూర్తి చేసి, వీలైనంత త్వరగా ఇళ్లను పేదలకు స్వాధీనం చేయాలని సూచించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాక చంద్రమౌళి, భాషబోయిన రమేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు గట్టు శ్రీధర్, జనగాని శివకృష్ణ, ఆకినపల్లి భిక్షపతి, మిల్కూరు శ్రీనివాస్, కిన్నర కృష్ణమూర్తి, నీగ్గుల లింగయ్య తదితరులు పాల్గొన్నారు.



గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం లక్ష్యం

◆ సమష్టిగా ముందుకు సాగాలి
◆ జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్



హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ : రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్ పిలుపునిచ్చారు. నాంపల్లిలోని రెడ్ రోజ్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో పలువురు రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, డీసీసీ అధ్యక్షులు మరియు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నవీన్ యాదవ్ మాట్లాడుతూ.. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయడంపై సుదీర్ఘంగా చర్చించినట్లు తెలిపారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడి ఓటును తప్పనిసరిగా నమోదు చేయించే బాధ్యతను పార్టీ శ్రేణులు తీసుకోవాలని కోరారు. నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలోకి వెళ్లి పట్టభద్రుల వద్దకు చేరుకుని ఓటరు నమోదుపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. పార్టీ శ్రేణులన్నీ పూర్తి సమన్వయంతో పనిచేసి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయానికి బలమైన పునాది వేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిని కలిసిన యూఎఫ్ఈఆర్ డబ్ల్యూఏఎస్ ప్రతినిధులు

పౌర సమస్యలపై వినతిపత్రం సమర్పణ



హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ : తెలంగాణ ప్రభుత్వ పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, జీహెచ్ఎంసీ, ఎమ్ఎమ్సీ, సీఎమ్సీ ప్రత్యేక అధికారిని యునైటెడ్ ఫెడరేషన్ ఆఫ్ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్స్ తెలంగాణ ప్రతినిధులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పురపాలక సంస్థలు, పట్టణ పరిపాలనకు సంబంధించిన పలు కీలక సమస్యలను ప్రస్తావిస్తూ ఒక సమగ్ర వినతిపత్రాన్ని అందజేశారు. సమర్థవంతమైన క్షేత్రస్థాయి పాలన, మెరుగైన పౌర సేవలను అందించడమే లక్ష్యంగా క్యూర్ చట్టం ప్రకారం వార్డు కమిటీల ద్వారా పట్టణ పరిపాలనలో ప్రజా భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా యూఎఫ్ఈఆర్ డబ్ల్యూఏఎస్ ప్రతినిధులు నొక్కిచెప్పారు. పురపాలక పరిపాలనలో పౌరుల భాగస్వామ్యాన్ని మరింత పెంచడానికి వార్డు కమిటీలను క్రియాశీలకం చేయాలి. వర్షపు నీటి నిల్వ గుంతలను విస్తృతంగా ఏర్పాటు చేయడం మరియు రహదారి మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం. గేటెడ్ కమ్యూనిటీల మురుగునీటి శుద్ధి కర్మాగారాల నుంచి వచ్చే అదనపు నీటిని క్రమబద్ధంగా సేకరించి, సక్రమంగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలి. విస్తృత ప్రజా భాగస్వామ్యాన్ని ప్రోత్సహించేందుకు నిబంధనల నమోదు ప్రక్రియలను సరళీకృతం చేసి, ప్రాసెస్ ఫీజులను తగ్గించాలి. ఈ సమావేశంలో యూఎఫ్ఈఆర్ డబ్ల్యూఏఎస్ ప్రతినిధులు సీతారాం ధోలిపాల, వి.వి.రావు, ఆర్.సి.వి.బద్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు. సమాజ హితం దృష్ట్యా తాము లేవనెత్తిన సమస్యలను త్వరితగతిన పరిశీలించి, పట్టణ పరిపాలనను బలోపేతం చేయడానికి, సుస్థిర నీటి నిర్వహణను ప్రోత్సహించడానికి తగిన చర్యలు తీసుకోవాలని వారు అధికారులకు విజ్ఞప్తి చేశారు.

వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF
VANDE BHARATH
గురువారం, అక్టోబర్ 22, 2026

ఘనంగా పండుగ సాయన్న జయంతి వేడుకలు



వరంగల్, వాయిస్ ఆఫ్ వందే భారత్ : తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, బహుజన విప్లవ వీరుడు, 'తెలంగాణ రాబిన్ హుడ్'గా ప్రసిద్ధి గాంచిన పండుగ సాయన్న జయంతి వేడుకలను 4వ బెటాలియన్‌లో అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 4వ బెటాలియన్ కమాండెంట్ ఎన్.వి.ఎస్.శ్రీనివాస్ రావు ముఖ్య అతిథిగా విచ్చేసి, పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కమాండెంట్ శ్రీనివాస్ రావు మాట్లాడుతూ.. అణచివేతపై, పెత్తందారుల అరాచకాలపై ఎదిరించి నిలిచిన ధీశాలి పండుగ సాయన్న అని కొనియాడారు. పేద ప్రజల ఆకలి తీర్చడం కోసం, వారి హక్కుల పరిరక్షణ కోసం సాయన్న చేసిన పోరాటాలు ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. సమాజంలో వెనుకబడిన, బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన అందించిన సేవలను స్మరించుకుంటూ, మహనీయుల ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని బెటాలియన్ సిబ్బంది, అధికారులకు ప్రత్యేకంగా వ్యాస రచన పోటీలు నిర్వహించారు. క్రింది మూడు ముఖ్యాంశాలపై ఈ పోటీలు కొనసాగాయి. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలు పోలీసుల నుండి ఎటువంటి సేవలను ఆశిస్తారు?, పోలీసు అధికారుల జీవితాల్లో సోషల్ మీడియా పాత్ర – సోషల్ మీడియాకు బానిస కాకుండా ఉండటం ఎలా?, క్షేత్ర స్థాయిలో పోలీసింగ్ వ్యవస్థను బలోపేతం చేయడం అనే అంశాలపై కమాండెంట్ ఆదేశాల మేరకు అసిస్టెంట్ కమాండెంట్ బి.రాజు ఆధ్వర్యంలో ఆర్ఐ రాంప్రసాద్, ఆర్ఎస్ఐలు సంపత్, సురేందర్ ఈ పోటీలను విజయవంతంగా నిర్వహించారు. అసిస్టెంట్ కమాండెంట్ రాజు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అరుణ్, ఏఓ వసీం ఫర్హానా, ఆర్ఐలు కార్తీక్, రాజ్ కుమార్, రాంప్రసాద్, కృష్ణ, అలాగే పలువురు ఆర్ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



హైదరాబాద్‌లో ఘనంగా 'దత్తన్న ఆలై-బలయ్'

- 'దసరా సమ్మేళనం 2026కు హాజరైన ప్రముఖులు



హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ : నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించిన "దత్తన్న ఆలై-బలయ్ – దసరా సమ్మేళనం 2026" వేడుకలు కన్నులపండువగా సాగాయి. తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని, పరస్పర ఆప్యాయతలను, మత సామరస్యాన్ని చాటిచెప్పే ఈ గొప్ప వేదికపై మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ తదితర ప్రముఖులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అందరూ ఆత్మీయ అలింగనాలు చేసుకుని దసరా శుభాకాంక్షలు తెలుపుకున్నారు. తెలంగాణ గొప్ప సంస్కృతిని ప్రతిబింబించే ఈ ఆలై-బలయ్ వేడుకలకు దేశ, రాష్ట్ర రాజకీయ ప్రముఖులు పెద్ద సంఖ్యలో విచ్చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల, పంజాబ్ రాష్ట్ర గవర్నర్ గులాబ్ చంద్ కటారియా, మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు, కేంద్ర మంత్రివర్యులు జి.కిషన్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచందర్ రావు, పలువురు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, సీనియర్ రాజకీయ నాయకులు మరియు వివిధ రంగాల ప్రముఖులు పాల్గొన్నారు. సంప్రదాయ వంటకాలు, తెలంగాణ జానపద కళారూపాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో ఈ సమ్మేళనం ఎంతో కోలాహలంగా ముగిసింది.



ఘనంగా 'పండుగ సాయన్న' 174వ జయంతి వేడుకలు



- హాజరైన ఎంపీ ఈటల రాజేందర్, సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ : తెలంగాణ ప్రభుత్వం, బీసీ సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని రవీంద్రభారతి వేదికగా "తెలంగాణ రాబిన్ హుడ్, ముదిరాజ్ ముద్దుబిడ్డ" పండుగ సాయన్న ముదిరాజ్ 174వ జయంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా అత్యంత వైభవంగా నిర్వహించింది. ఈ వేడుకల్లో మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు శ్రీ ఈటల రాజేందర్ పాల్గొని పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ అనుముల రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సాయంత్రం వేళ సాగిన ఈ కార్యక్రమంలో సమాజంలో పండుగ సాయన్న అందించిన పోరాట స్ఫూర్తిని, పేదల సంక్షేమానికి ఆయన చేసిన త్యాగాలను ప్రముఖులు స్మరించుకున్నారు. ఈ సభలో రాష్ట్ర మంత్రులు వాకిటి శ్రీహరి, పొన్నం ప్రభాకర్, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండ ప్రకాష్ ముదిరాజ్, కమిటీ సభ్యులు గురు జ్ఞానేశ్వర్ ముదిరాజ్, మాజీ ఎమ్మెల్సీ కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్, నాయకులు నీలం మధు ముదిరాజ్, ఎర్ర శేఖర్ ముదిరాజ్, సూపర్ శంకర్, కాసాని వీరేష్, సునీత రావు, రోహిత్‌లతో పాటు వివిధ ముదిరాజ్ సంఘాల నాయకులు, ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





ములుగు ఎస్పీని కలిసిన టీజేపీ నూతన కమిటీ

ములుగు, వాయిస్ ఆఫ్ వందే భారత్ : ములుగు జిల్లాలో నూతనంగా ఎన్నికైన తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ (టీజేపీ) జిల్లా కార్యవర్గ సభ్యులు గురువారం జిల్లా ఎస్పీ కేకాన్ సుధీర్ రామ్‌నాథ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గానికి ఎస్పీ పుష్పగుచ్ఛం అందించి ఘనంగా అభినందించారు. ఈ భేటీలో భాగంగా ఎస్పీ తన ఛాంబర్‌లో జర్నలిస్టులతో ప్రత్యేకంగా ముచ్చటించారు. జిల్లాలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలు, మీడియా భద్రత, అధికారుల నుంచి సమాచార అందుబాటు తదితర కీలక అంశాలపై వారితో సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సమాజంలో వాస్తవాలను నిర్భయంగా ప్రజలకు చేరవేయడంలో జర్నలిస్టుల పాత్ర అత్యంత కీలకమని ప్రశంసించారు. చట్టపరిధిలో విధులను నిర్వర్తించే జర్నలిస్టులకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో మీడియాతో పాటు పోలీస్ శాఖ సమన్వయంతో పనిచేస్తే మెరుగైన ఫలితాలు వస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. జర్నలిస్టులకు ఎలాంటి సమస్య ఎదురైనా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ సమావేశంలో తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ ములుగు జిల్లా అధ్యక్షులు బేతి సతీష్ యాదవ్, ప్రధాన కార్యదర్శి ఎనగందుల కొమురయ్య, ఉపాధ్యక్షులు చల్లగురుగుల రాజు, కోశాధికారి సంఘు రంజిత్ కుమార్, సభ్యులు భిక్షపతి తదితరులు పాల్గొన్నారు. తమను ఆదరించి, ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపిన ఎస్పీకి నూతన కమిటీ సభ్యులు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.